
# అధికాషాఢం


## ఉపాధ్యాయుల గౌరీశంకరరావు

**ఆషాఢం !**

ఏ తెలుగు నెలకూలేని ప్రత్యేకత దీని కెందుకు కల్పించారో మనవాళ్లు! క్రొత్త జంటను వేరుచేసి ఒకరి తలపుల్లో ఒకరు విలవిల లాడుతుంటే వకవక వగలబడి నవ్వుతుంది. వారి నిట్టూర్పులను మేఘ మాలికలుగా మార్చేసుకొని విహరిస్తుంది. సుదీర్ఘ నిరీక్షణలో ఒకరి కోసం ఒకరు ఎడారి బాటసారు లవుతుంటే తొలకరి చినుకుల జల్లు త్రుళ్లిపోతుంది.

మూడు నిద్రలు పూర్తయి [ఒక్క రాత్రయినా నిద్రపోతే గదా] ఒకరి నొకరం తనివితీరా చూసుకోకుండానే, చెప్పుకొంటున్న ముచ్చట్లు పూర్తి గాకుండానే మా మధ్య ఆషాఢం ప్రవేశించింది. చెరో రెక్కా పుచ్చుకొని చెరో వైపు మా ఇద్దర్నీ విసిరేసింది. ఒకరి నొకరం వదులుకోలేక






అషాఢాన్ని తిట్టుకొన్నాం.

అమె తలపుల్లో విహరిస్తూ ఒంటరిగా డాబాపై పడుకొంటే మల్లెల తెమ్మెర క్రమ్ముకొంటుంది. ఒళ్లెల్లా కళ్లు చేసుకొని అమె కోసం వెతుక్కుంటాను. అకాశంలో మబ్బుతునక చేతు లూపుతూ వెళ్లిపోతుంది. నిర్వేదంతో అడుగులు తడబడుతుంటే గదిలో కెళ్లి తలు పేసుకొని కొత్తగా కొన్న కేలండర్ని తిరగేస్తాను. అషాఢం ఇం కెన్నాళ్లని లెక్కలు వేస్తాను. అమె రాసిన నిన్నటి ఉత్తరాన్ని పదే పదే చదువుకొంటూ ఏ తెల్లవారుజాముకో కునుకు తీస్తాను. పూపొదల మాటున నిలచి అమె సైగలు చేస్తుంటే అమె నందుకోవాలన్న కోరికతో పూల తోటంతా పరుగులు పెడుతుండగానే తెల్లవారిపోతుంది.


సాయంత్రం మిత్రులతో సాహితీ విషయాలు చర్చిస్తూ శ్రీశ్రీ ధోరణిలో శ్రీనాథుని సీసం వినిపిస్తే 'అషాఢం' అని నవ్వుతారు వాళ్లు. కలలు కనే కళ్లతో మంచంపై వాలిపోతే రాత్రి హోటలు నుంచి వచ్చిన క్యారియరు అలాగే ఉండడం చూసిన పనిమనిషి "బాబూ! అషాఢం ఇం కెంత వరకుంది?" అని అడుగుతూ ముసి ముసిగా నవ్వుకొంటుంది. అమె జ్ఞాపకాలు గిలిగింతలు పెడుతుంటే పాఠం చెబుతూ చెబుతూ మధ్యలో చేష్టలు దక్కి నిలబడితే హృదయ పరిపక్వత చెందిన విద్యార్థులు "అషాఢమాసం కదూ! అమ్మగారు లేనట్టుంది" అంటూ పుస్తకాలు చాటు చేసుకొని గుసగుస లాడుతారు.

ఒకానొక ప్రేమ పాఠం హృదయాన్ని ఊపేస్తుంటే అమె అనుభూతుల ప్రవాహంలో మునిగిపోతూ అమెకు నే రాసిన ఉత్తరాల కట్టలు పొన్ను డబ్బాలో కిటకిట లాడుతాయి. సాయంత్రం రెండవ పీరియడులో నాకు ఉత్తరాన్ని అందిస్తూ ఎటెండెర్ ముసి ముసిగా నవ్వుకొంటాడు. ఏ స్తంభం చాటునో నిలచి నే నా ఉత్తరాన్ని పదే పదే చదువుకోవడాన్ని సహోపాధ్యాయులు ఒక్కొక్కరుగా చూసి గుసగుస లాడుకొంటారు.

కాలం అషాఢానికి చరమగీతం పాడేస్తుంటే ఫలానా రోజున వస్తున్నా మన్న శ్రీమతి ఉత్తరం నా చేతుల్లో వాలింది. అమె వస్తోందన్న సంతోషం ఒళ్లెల్లా ఊపేస్తుంటే కాలం గడిచేది కాదు. అమెను సంతోషంతో ఉక్కిరి బిక్కిరి చేసేయాలని ఏవేవో ఆలోచనలు. పొంగెత్తిన ప్రేమ ప్రవాహంలో నింగిని తాకే తరంగాల డోలికలు.

అనుకొన్న ఆ రోజు వచ్చేసింది. మధ్యాహ్నాం స్కూలుకు శలవుపెట్టి బస్ స్టాండులో కూర్చున్నాను. రెండు గంట లాలస్యంగా వచ్చింది నీలకంఠాపురం బస్సు. బస్సులోంచి అమె చేయి ఊపితే చల్లనిగాలి ఒక్కుదుటున తాకినట్లయింది. గబగబా బస్సు దగ్గరకు పరుగు తీశాను. సామాన్లు దించమని పోర్టర్‌కు పురమాయించాను. సూట్కేసు, బేగు, బెడ్డింగు దిగాయి. ఆ వెనుకే శ్రీమతి. అప్పుడు చూశాను శ్రీమతి వెనుక దిగుతున్న ఆవిడను.

తెల్లగా తళతళ లాడుతున్న నన్నని మల్లువంచె కట్టుకొని, తలపై చెంగు సరిచేసుకొంటూ, కంచు చెంబు భద్రంగా పట్టుకొని బస్సుకు అడ్డంగా దిగలేక ఒద్దింపుగా మెట్లు దిగుతూ అవసోపాలు పడుతున్న భారీ కాయాన్ని. అమె శ్రీమతి బామ్మగారు.



"ఏం నాయనా, బాగున్నావా? ఇదిగో అషాఢం వెళ్లింది కదా. నీ పెళ్లాన్ని నీకు భద్రంగా అప్పగించి మీ సంసారానికి ఓ రూపు తెచ్చి నేను వెళ్లిపోదామని వచ్చా." ఇదీ బామ్మగారి పలకరింపు. అమె తీక్షమైన కళ్లు మా ఊరి బస్ స్టాండు చుట్టూ ఉన్న కొండలవైపు పరీక్షగా చూస్తున్నాయి.

"అమ్మో! చాలా పెద్ద కొండలు. అడవి కూడా దట్టంగానే ఉంది... ఇంత పెద్ద అడవిలో వనవాస ముంటున్నట్లు ఎలా ఉంటారో, ఏమో! సినిమాలు, చిత్రాలు అలవాటుపడిన పిల్ల ఈ అడవిలో ఎలా కాపురం చేస్తుందో" బామ్మగారి స్వగతం అతిశీతల పవనాల్లా తాకుతోంది.

ఎత్తు అరుగుల చీడి, ఒక పెద్ద గది - దానికి అనుకొని చిన్న వంటిల్లు, ఇంటి చుట్టూ అడవి తీగల కంచె. పొందికగా అలంకరించిన ఆ ఇంటిని, నా అభిరుచిని మెచ్చుకోలుగా చూసింది శ్రీమతి.

"ఇల్లు చిన్న దయినా పొందికగా ఉంది. మీ ఇద్దరికీ చక్కగా సరిపోతుంది." మామ్మగారు కాంప్లిమెంటు పారేశారు.

'హమ్మయ్య' అనుకొన్నాను.

పనిమనిషి వచ్చి చకచకా పన్లు చేసుకుపోతోంది. శ్రీమతి చీర బిగించి తన పాకశాస్త్ర కళను ప్రదర్శించడానికి సిద్ధపడింది. 'హోటలు భోజనం, ఒంటరి నిద్ర' తప్పిపోతున్నాయన్న అనందం వసంత సమీరంలా హృదయాన్ని గిలిగింతలు పెట్టింది.

"అయితే నాయనా! ఈ అడవిలో పులులు, సింహాలు లాంటి జంతువులు ఏమైనా ఉంటాయా? అయినా నా మతి గాని అడవిలో ఉండకపోతే ఊర్లో ఉంటాయా?" ప్రశ్న సమాధానం బామ్మగారే చెప్పుకొంటున్నారు.

"ఏం ఉద్యోగాలో ఏమిటో! నిక్షేపం లాంటి పిల్లని ఈ అడవిలో పడేశాం. అడవి జంతువు లేమైనా ఈ ఊర్లు వెంట పడవు కదా? క్రిందటి కోమారు కాముడమ్మ మొగుడు ఉద్యోగ రీత్యా అడవిలో తిరుగుతుంటే జంతువు తినేసిందిట. అదిగో... అనాటినుంచే అడవన్నా అడవి ఉద్యోగాలన్నా నాకు పరమ భయం."

మామ్మగారి మాటల ధోరణి ఆగే అవకాశం లేదని నాకు తెలుసు. మరి కొద్ది సమయం ఆవిడ తీరు అలాగే సాగితే నేను బట్టలు చింపుకొని ఊరిమీద పడ్డా ఆశ్చర్యపోనక్కరలేదు. లేచి వెళ్లిపోదామంటే సభ్యతకు భంగం అని అనుమానం. నా సంకటస్థితిని శ్రీమతి కనిపెట్టినట్టుంది.

"బామ్మా! రాత్రి నీకు ఫలహారం ఏం చేయ మంటావు?" మాట మార్చింది శ్రీమతి. "ఏమిటో! నీ అభిమానం సుందరీ! ఫలహారం ఏం చేస్తావు చెప్పు. మనమా ఇప్పు డొచ్చాం. ఇంతవరకు ఇది బ్రహ్మచారి కొంప. ఏం వస్తువు లున్నాయో, ఏవి లేవో తెలియదు. ఈ రాత్రికి ఏదో సర్దుకుపోతాను. రేపటి నుంచి చూసుకోవచ్చు."

"అబ్బెబ్బే! అన్ని వస్తువులూ ఇంట్లో ఉన్నాయండి. మీరు మొగమాట పడవద్దు. కావాలంటే అరటిపళ్లు దొరుకుతాయి. తెస్తాను." బామ్మ మాటలను మధ్యలోనే అడ్డుకొన్నాను.

"దా న్దేముంది., మునలి ముండను... ఏవో రెండు పళ్ళు మంచివి పట్రా, నాయనా! ఎంతైనా అబ్బాయికి పెద్దవాళ్లంటే తగని గౌరవం." బామ్మగారి మాటలు వినకుండానే లేచాను.

బద్ధకంగా నూర్యుడు కొండల్లోకి జారుకుంటున్నాడు. అదరాబాదరా నన్నని మేఘాలు ఆకాశం అంతా క్రమ్ముకుంటున్నాయి. చల్లదనాన్ని నింపుకొన్న కొండగాలి వుంజుకుంది. చిరుచలితో సాయంత్రం వాతావరణం అల్లుకొంటోంది. వేడి నన్నగా రగులుతుంటే తీపి ఊహల్లో తేలిపోతున్నాను.

మల్లెపూలు, అడవి నంపెంగలు ఒక చేత్తో, అరటిపళ్లు ఒక చేత్తో పట్టుకొని ఇంటికి వచ్చాను. అందుకొంటున్న శ్రీమతి చేయి తాకిడికి నాలో విద్యుత్తరంగాలు. క్రొంగొత్త అందాలతో శ్రీమతి. నా ఉద్విగ్న హృదయంపై మల్లెల గుబాళింపులు అడవి నంపెంగలు ఎక్కుపెట్టిన మన్మథుని పూలబాణాలు. శ్రావణ మేఘాల జల్లులు అడవి వాతావరణాన్ని మత్తులో జోకొడుతున్నాయి.

"అమ్మాయీ! నా మంచాన్ని అరుగుమీద వేయ కమ్మా! ఏ అడవి జంతువుకో ఆహారంగా మారిపోగల్ను" బామ్మగారి మాటలు ములుకుల్లా తగిలాయి.

డబుల్ కాట్ బెడ్‌పై వా ళ్లిద్దరు. అదే గదిలో గోడ వారగా మడత మంచంపై నేను. ఒకే గదిలో మే మిద్దరం ఉన్నా మా మధ్య చెలియలి కట్టలా బామ్మ.


"హా బామ్మా! నీవు నా పాలిటి విలన్‌గా మారిపోయావా?" నా హృదయం ఆక్రోశించింది. ఓ చిరునవ్వు విసిరి శ్రీమతి బామ్మ చాటున గువ్వలా ఒదిగిపోయింది. నముద్ర ఘోషగా గుర్రు పెడుతున్న బామ్మ. నిద్ర పట్టక తప నృమాధిలో నేను.

అర్ధరాత్రి. కీచురాళ్ల నవ్వడి. అడవిలో నుంచి వినిపించే నక్కల ఊళలు బామ్మ గుర్రుతో కలసిపోయి ఒక వింత శబ్దాన్ని పుట్టిస్తున్నాయి. మెల్లగా మంచం దిగాను. అడుగులో అడుగు వేనుకుంటూ దొంగలా, పిల్లిలా శ్రీమతిని నమీపించి అరి పాదాన్ని నన్నగా చేత్తో గీకాను.

"బామ్మోయ్... నామీద ఏదో పాకుతోందే... పాము... పాము..." శ్రీమతి కేకలు గదిలో మార్మ్రోగాయ్. గుర్రు కొడుతున్న బామ్మ మంచంలో విగ్రహంలా కూర్చుంది, మనవరాల్ని పొదివిపట్టుకొంటూ.

"నాయనోయ్! ఈ దిక్కుమాలిన అడవిలోకి వచ్చి పడ్డామురా. చక్కదనాల కుందనపు బొమ్మలాంటి పిల్ల ఈ అడవిలో ఎలా ఉంటుందిరా... అర్ధరాత్రి అపరాత్రి అనకుండా ఇలా పాము లయితే ఎలా ఉండాల్రా బాబోయ్.!." బామ్మగారు ఉదాత్తానుదాత్త స్వరిత స్వరాలతో రాగయుక్తంగా అందుకొన్నారు.

అంతవరకు నాలో రగులుతున్న ఉత్సాహం చప్పగా చల్లారిపోయింది. లేచి లైటు వేశాను. బామ్మని బల్లిలా కరుచుకొన్న శ్రీమతి. కళ్లు




మూసుకొని రాగాలాపన చేస్తున్న బామ్మ. ఇద్దరూ ఒకేసారి పాము విషయం చెప్పారు. లేని పాముకోసం అర్ధరాత్రి ఎక్కడ వెతకను?

అర్ధరాత్రి ఈ అంకమ్మ శివాలకు ఇరుగు పొరుగు వారు లేచి నానా హంగామా చేయకూడదు, అది తక్షణ కర్తవ్యం. నాలుగు మూలలూ చూసి పాము లేదని అదంతా నిద్రలో వచ్చిన కల కాబోలని నచ్చచెప్పబోతున్నాను.

నే నూహించిన ప్రమాదం రానే వచ్చింది. ఇటునుంచి రెడ్డి, అటునుంచి రాజు లేచి ఒకేసారి తలుపులు బాదడం ప్రారంభించారు "ఏమిటయింది గురూ" అంటూ. ఏడవలేక నవ్వుతూ పాము విషయం చెప్పగానే కాలనీలో లైట్లన్నీ టపటపా వెలిగాయి. కర్రలు, టార్చిలైట్లు లేని పాముకోసం వెతుకులాట ప్రారంభించాయి.

వడకగదిలో నుంచి బయటపడ్డ అమ్మలక్కలంతా పాముల కథలు, అవి పగ పట్టడాలు - వాళ్ల వాళ్ల ఊళ్లల్లో జరిగిన పాము బలి నంఘటనలు మొదలయిన వాటిని గురించి వివరంగా చర్చించడం ప్రారంభించారు. అర్ధర్మాత్రి రెండు గంటల కాలక్షేపం తరువాత ఒక రొకరుగా వెళ్లిపోయారు.

నమయం నందర్భం చూసుకొని శ్రీమతికి నే చేసిన పనిని గూర్చి చెప్పగానే నవ్వుకొంటూ, నావైపు జాలిగా చూస్తూ మళ్ల బామ్మతో బాటు మంచం ఎక్కేసింది.


"నాతి గల బ్రహ్మచర్యము నా తరమా బ్రహ్మదేవ" అంటూ నా నోటినించి ఆశువుగా పద్యాలు, గేయాలు, కూనిరాగాలూ వెలువడుతున్నాయి. రకరకాల పథకాలు ఆలోచించి ఆలోచించి మెదడు గతిలేని స్థితిలో నిద్రలోకి జారుకొంది.

ఒకటి రెండు రోజులు నరదాగా నన్ను ఆట పట్టిస్తున్నట్లుగా బిగపట్టిన శ్రీమతి స్థితి తరువాత నాలాగే మారిపోయింది. అదురుతున్న పెదవులు. దీనమైన చూపులు, పాలిపోతున్న చెక్కిళ్లు రగులుతున్న తమకాన్ని వే నోళ్ల చాటుతున్నాయి. మా మధ్య అడ్డు గోడలా ఉన్న బామ్మను తొలగించుకోవాలన్న నా తలంపుకు శ్రీమతి తన నహాయాన్ని అందించసాగింది.

"బామ్మా! ను వ్వెళ్లిపో!" అని చెప్పడం మర్యాద కాదు. 'పొమ్మనలేక పొగ పెట్టడం' అన్నది మా సిద్ధాంతం. ఆషాఢం వెళ్లినా అధికాషాఢంలా తగులుకొన్న బామ్మని వదిలించుకోడం ఎలా?

ఏక భుక్తం చేసే బామ్మకి రాత్రి విధిగా ఫలహారం ఉండాలి. కొయ్యరొట్టి, బెల్లం రొట్టి, దిబ్బరొట్టి, చల్ల పొంగరాలు - ఇవి బామ్మ నిత్యం చేసే ఫలహారాలు. వా టన్నిటికీ శ్రీమతి శలవు పెట్టి ఉప్పుడు పిండి ఉడకేయడం ప్రారంభించింది.

"ఇలాంటి ఊళ్లో నా కన్నీ కావాలంటే ఎలా కుదురుతుంది? నీ చేత్తో ఏం చేసినా అమృతంలాగే



ఉంటుంది. ఉప్పుపిండి చాల్లే అమ్మా!" బామ్మగారు అల్ప సంతోషం బయట పెట్టారు.


తన పథకం విఫల మవడంతో శ్రీమతి బేలమొగం వేసింది.

ఓ ఆదివారం మధ్యాహ్నం కాఫీ త్రాగుతూ ఏజెన్సీ వాతావరణం గురించి బామ్మగారికి క్లాసు తీసుకొన్నాను. నీటిలో కాల్షియం తక్కువగా ఉంటుందని, దానివల్ల రోగాలు వచ్చే ప్రమాదం ఉందని, అంతేకాకుండా మలేరియా జ్వరాలు విపరీతంగా వస్తాయని, మెనింజైటీస్ అనే వ్యాధి ఈ మధ్య క్రొత్తగా వస్తోందని, వయసు మళ్లిన వారు, నెత్తురు పలచబడ్డవారు ఈ వాతావరణంలో ఉండడం మంచిది కాదని ఉన్నవీ, లేనివీ కల్పించాను. నా మాటలన్నీ ఆవిడ ఓపిగ్గా వింది. సంతృప్తిగా త లాడించింది. చిరునవ్వుతో కొట్టి పారేసింది.

"ఏమిటో నాయనా! నీ అభిమానం కొద్దీ నీవలాగా అంటున్నావు గాని, ఈ డాక్టర్లు చెప్పేవన్నీ నిజ మనుకొంటున్నావా? 'అన్నం అంబం. పప్పు పైత్యం' అని చెబితే తినడం మానేశామా? ఇదీ అంతే! నా అనుభవం చెప్ప మంటావా? చల్లనిగాలి - ప్రాణం హాయిగా ఉంది. పుట్టిన దగ్గర నుంచి వస్తున్న మలబద్ధం హాయిగా పోయింది. ఇంతకుముందు కాళ్లు పట్టుండేవి. ఇప్పుడు అలాంటి వేమీ లేవు. హాయిగా తిరుగుతున్నాను. నిజం చెప్పొద్దూ. ఇక్కడకు వచ్చేముందు వారం రోజులు కంటే ఎక్కువ ఉండకూడ దనుకొన్నా. కానీ ఇక్కడకు వచ్చిన తర్వాత మరో వారం రోజులు ఉండా లనుకొంటున్నా. ఈలోగా అమ్మాయికి వంటలన్నీ నేర్పేయవచ్చు. నా ఆరోగ్యం కుదుర్చుకోవచ్చు. ఏమంటావు నాయనా!"

ఉండుండి మరో వారం రోజు లుంటానన్న బామ్మగారి బాంబుకు శ్రీమతి, నేను అదిరిపడ్డాం. "ఇలా మమ్మల్ని ఇబ్బంది పెట్టి మా ప్రాణాలు కూడా తీయవద్దు" అనుకొన్నాను ఖసిగా.

బామ్మగార్ని పంపించడం ఎలాగో ఒక పట్టాన నాకు అర్థం కాలేదు. ఈ సున్నితమైన సమస్యను



గూర్చి ఎవరితో చర్చించాలో తట్టడం లేదు. ఎవరితోనైనా అంటే నవ్వుకొని హేళన చేస్తారని భయం. చివరకు ఏదైతే అది అయిందని మిత్రుడు సుబ్బారావుకు ఈ విషయం చెప్పా. బామ్మగార్ని పంపించే ఉపాయం బోధించమని వేడుకొన్నా. పని సాధించినట్లయితే తీర్థప్రసాదాలతో పార్టీ ఇచ్చుకొంటానని ప్రతిజ్ఞ చేశా. సుబ్బారావు తీవ్రంగా ఆలోచించసాగాడు.

మర్నాడు నా తపస్సు ఫలించినట్లుగా టెలిగ్రాం వచ్చింది. కలకత్తాలో ఉన్న మా పిన మామగారు తిరుపతి వెళ్తున్నట్లు, దార్లో దిగి తల్లిని తీసుకుపోబోతున్నట్లు, అందువల్ల వెంటనే బామ్మగార్ని పంపించేయమని. టెలిగ్రాంని చూసిన మనసు వెర్రి ఆనందంతో నర్తించింది.

వార్త విన్న శ్రీమతి కళ్లల్లో మెరుపు. నా ముఖంలోకి చూడాలంటే ఆమె బుగ్గల్లో ఎరుపు. బామ్మగారి ప్రయాణానికి ఏర్పాట్లన్నీ చురుగ్గా సాగుతున్నాయి. బామ్మ - శ్రీమతి ఒకరి కొకరు జాగ్రత్తలు చెప్పుకొన్నారు. ఆ రాత్రి నాకు నిద్దుర పట్టలేదు. ఎంత వేగం తెల్లవారుతుందాని వేయి కళ్లతో ఎదురు చూశాను.

వేకువజాము నాలుగు గంటలకే లేచి బామ్మగారి స్నానానికి ఏర్పాట్లు చేసింది శ్రీమతి. ఆరు గంటల బస్సుకు బామ్మగారు తయారయేసరికి యజ్ఞం చేసినంత పని అయింది. ఏ వస్తువులూ మరిచిపోకుండా ఒకటికి రెండుసార్లు తన వస్తువులు సరిచూసుకొంది. రకరకాల జాగ్రత్తలు చెప్పి ఆవిడ బయలుదేరింది. బామ్మగార్ని దగ్గరుండి బస్సు ఎక్కించాను.

ఇంటికి వస్తుంటే సుబ్బారావు కనిపించి పార్టీ అడిగాడు. ఆ టెలిగ్రాం మా అత్తవా రింటి నుంచి వచ్చింది కాదని, పార్వతీపురం వెళ్లిన సుబ్బారావు ఈ ప్లాన్ బనాయించాడని తెలిసి అతనికి తప్పకుండా పార్టీ ఇచ్చి నా కృతజ్ఞతలు తెలియజేసుకొంటానని వాగ్దానం చేశాను. రెండు రోజులు సెలవు గీకి సెలవు చీటీ అతని చేతిలో పెట్టాను.

"ఇది మన్మథ సామ్రాజ్యం" పాట హమ్మింగు చేసుకొంటూ ఉక్కిరిబిక్కిరి అవుతున్న హృదయంతో ఇల్లు చేరాను. గుమ్మం దాటి లోపలికి అడుగు పెట్టాను. గదిలో ఓ వారగా చాప పర్చుకొని ప్రక్కన చెంబుతో శ్రీమతి. అల్లరిగా నన్ను చూసి నవ్వుతోంది. పొంగుతున్న పాలపై నీళ్లు జల్లినట్లుగా నా ఉత్సాహం చప్పగా చల్లారిపోయింది.

వేయి టన్నుల నీరసం ఒక్క ఉదుటున దాడి చేస్తుంటే మంచంపై జారిపోయాను. తను చేసిన ప్రాక్టికల్ జోకును పక్కన పెట్టి కంగారుగా నా ముఖంలోకి చూస్తున్న శ్రీమతిని కౌగిట్లో బంధించి ఉక్కిరిబిక్కిరి చేసేస్తుంటే, కొండ చాటునుంచి తొంగి చూస్తున్న సూర్యునిపై కమ్ముకొన్న శ్రావణ మేఘం నన్నని తుంపర్లతో ప్రకృతిని పులకింపజేసింది.

